


జల సవ్వడి.. జన సందడి




పరవళ్లు తొక్కుతున్న కృష్ణమ్మతో సెల్ఫీ



నది చెంత యువకుల సందడి



తీసుకుందాం ఓ సెల్ఫీ



ఎగువ నుంచి భారీగా వరద వస్తుండటంతో శ్రీశైలం ప్రాజెక్టు 4 గేట్లను మంగళవారం తెరిచారు. దీంతో కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతూ దిగువకు ప్రవహిస్తోంది. ఉరకలెత్తుతున్న కృష్ణానది అందాలను చూసేందుకు సందర్శకులు తరలి వస్తున్నారు. డ్యాం వద్ద సెల్‌ఫోన్‌లతో సెల్ఫీలు దిగుతూ ముచ్చట పడుతున్నారు. ఒక వైపు జల సవ్వడి, మరో వైపు జనం సందడితో శ్రీశైలం డ్యాం పరిసరాలు కళకళలాడుతున్నాయి.

- ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, మహబూబ్‌నగర్



నిండు నీటితో కళకళలాడుతున్న శ్రీశైలం జలాశయం



సరదాగా సెల్ఫీ



నది సమీపంలోని ఘాట్‌రోడ్డుపై కిక్కిరిసిన వాహనాలు



ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు వినతిపత్రం ఇచ్చి సమస్యను వివరిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అంతర్రాష్ట్ర బ్రిడ్జి నిర్మించాలి

- అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ
- ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు వినతి

అచ్చంపేట, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, అచ్చంపేట నియోజకవర్గంలోని మద్దిమడుగు నుంచి 12 కిలోమీటర్ల దూరంలో ఉన్న కృష్ణానదిపై అంతర్రాష్ట్ర బ్రిడ్జిని నిర్మించాలని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కోరారు. శ్రీశైలం ప్రాజెక్టు గేట్లు ఎత్తేందుకు వచ్చిన ఆయనను ఎమ్మెల్యే కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వంశీకృష్ణ మాట్లాడుతూ శ్రీశైల దేవస్థానం పాలకమండలిలో అచ్చంపేటకు చెందిన వారికి అవకాశం ఇవ్వాలని కోరారు. బ్రిడ్జిని నిర్మించాలని కోరుతూ గత ఏడాది శ్రీశైలం ప్రాజెక్టు గేట్లు ఎత్తే సందర్భంగా కూడా వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి వంతెన నిర్మాణం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రస్తుతం ఏపీ లోని మాచర్ల నుంచి అచ్చంపేటకు రావాలంటే 379 కిలోమీటర్లు అవుతుందని చెప్పారు. బ్రిడ్జి నిర్మిస్తే చేపడితే దాదాపు 80 కిలోమీటర్ల దూరం తగ్గుతుందన్నారు. అలాగే జడ్చర్ల, అచ్చంపేట, మద్దిమడుగు మీదుగా మాచర్ల వరకు రవాణా సౌలభ్యం కలుగుతుందని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేతో పాటు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేందర్, నాయకులు కాశన్న యాదవ్, మల్లేశ్ తదితరులు కలిసి సీఎం చంద్రబాబుకు నల్లమల టైగర్ చిత్రపటాన్ని బహూకరించారు.

ఇన్సులిన్ ఇస్తలేరు



మెడికల్ కళాశాల సమీపంలో ఉన్న సెంట్రల్ డ్రగ్ స్టోర్ భవనం

- ఏడు నెలలుగా నిలిచిన సరఫరా
- ఇబ్బంది పడుతున్న టైప్ -1 షుగర్ బాధితులు
- ప్రైవేటులో కొనుగోలుతో రోగులపై ఆర్థిక భారం

వనపర్తి వైద్యవిభాగం, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వాలు కోట్ల రూపాయలను వెచ్చిస్తున్నాయి. కానీ సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదు. ఫలితంగా రోగులు ప్రైవేటు వైద్యాన్ని ఆశ్రయించక తప్పడం లేదు. డయాబెటిస్ రోగులను గుర్తించి వారికి మెరుగైన వైద్యం అందించాలనే సంకల్పంతో వనపర్తి జిల్లాలో కలెక్టర్ ఆదర్శ్ సురభి 'మిషన్ మధుమేహ' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా జిల్లాలో 30 సంవత్సరాలు పైబడి న 3,04,215 మందికి షుగర్ పరీక్షలు చేయించారు. వారిలో 19,643 మంది షుగర్ వ్యాధితో బాధపడుతున్నట్లు అధికారులు గుర్తించారు. వారికి అవసరమైన మందులను ఉచితంగా అందిస్తున్నారు. వారిలో టైప్-1 డయాబెటిస్ బాధితులకు ఇన్సులిన్‌తో మాత్రమే షుగర్ కంట్రోల్ చేయాల్సి ఉంటుంది. దాదాపు 300లకు పైగా షుగర్ లెవల్ ఉండే వారు తప్పకుండా ఇన్సులిన్ తీసుకోవాలి. కానీ ఏడు నెలలుగా సరఫరా కావడం లేదు. దీంతో ఇన్సులిన్ అవసరమైన టైప్-1 బాధితులు 56 మంది ప్రైవేటులో కొనుగోలు చేయాల్సి వస్తుండటంతో వారిపై ఆర్థిక భారం పడుతోంది.



సెంట్రల్ డ్రగ్ స్టోర్‌లో నిల్వ ఉన్న మందులు



సెంట్రల్ డ్రగ్ స్టోర్‌లో ఫ్రిజ్‌ల కొరత

వనపర్తి జిల్లా కేంద్రంలోని సెంట్రల్ డ్రగ్ స్టోర్‌లో ఇన్సులిన్ నిల్వ ఉంచడానికి ఫ్రిజ్‌ల కొరత ఇబ్బందిగా మారింది. దాదాపు 1000 లీటర్లకు పైగా సామర్థ్యం ఉన్న ఫ్రిజ్జులు అవసరం కాగా, 300 లీటర్ల సామర్థ్యం కలిగిన ఒకే ఒక్క ఫ్రిజ్ ఉంది. దీంతో చేసేదేమీ లేక జిల్లాకు అవసరమైన ఇన్సులిన్‌ను నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్‌లలో నిల్వ ఉంచుతున్నారు. అవసరమైనప్పుడు అక్కడి ఉంచి తెప్పించుకుంటున్నారు. సామర్థ్యానికి సరిపడా ఫ్రిజ్‌లు ఉంటే టీటీ, ఆక్సిటోసిన్, మిథైల్ ఎర్గోమెట్రిన్, రేబిస్ వ్యాక్సిన్, యాంటీ స్నేక్ వీనమ్, ఇన్సులిన్ తదితరాలను అవసరమైన మేర స్థానికంగా నిల్వ ఉంచుకునే అవకాశం ఉంటుంది.

కోల్డ్ స్టోర్ రూం ఏర్పాటుకు చర్యలు

సెంట్రల్ డ్రగ్ స్టోర్‌లో కోల్డ్ స్టోర్‌ను ఏర్పాటుకు ఒక గదిని సిద్ధం చేస్తున్నారు. అందుకోసం అవసరమైన పనులు జరుగుతున్నాయి. కోల్డ్ స్టోర్ ఏర్పాటైతే ఫ్రిజ్‌ల అవసరం ఉండక పోవచ్చు. కానీ పనుల్లో జాప్యం జరుగుతుండటం సమస్యగా మారింది.

ఇండెంట్ పెట్టి త్వరలోనే తెప్పిస్తాం



ఇన్సులిన్ సరఫరా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సమస్య. అయినప్పటికీ జిల్లాలోని టైప్-1 డయా బెటిస్ పేషంట్లను దృష్టిలో పెట్టుకుని ఇండెంట్ పెట్టి త్వరలోనే ఇన్సులిన్ వ్యాక్సిన్ తెప్పించే ప్రయత్నం చేస్తున్నాం. టెండర్ ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలతో ఇన్సులిన్ పంపిణీలో కొంత జాప్యం జరిగి ఉండొచ్చు. ఏదేమైనా జిల్లాకు మాత్రం అతి త్వరలోనే ఇన్సులిన్ తెప్పించి షుగర్ పేషెంట్లకు ఇస్తామని తెలిపారు.

- డాక్టర్ అల్లే శ్రీనివాసులు,
జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి

రైతుల కష్టాలు తీరాయి

- పర్యాటక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు
- ఎంజీకేఎల్ఐ ప్రాజెక్టు నుంచి సాగు నీరు విడుదల



పూలు చల్లి కృష్ణా జలానికి స్వాగతం పలుకుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, డాక్టర్ రాజేశ్‌రెడ్డి, మేఘారెడ్డి

కొల్లాపూర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వల్లే రైతుల కష్టాలు తీరుతున్నాయని పర్యాటక, ఎక్సైజ్, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. పంటలకు సకాలంలో సాగునీరు అందిస్తున్నామని తెలిపారు. రైతు భరోసా, రుణమాఫీ అమలు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా, కొల్లాపూర్ మండల పరిధిలోని ఎల్లూరు గ్రామంలో రేగుమాన్ గడ్డ వద్ద మంగళవారం ఎంజీకేఎల్ఐ ప్రాజెక్టు పంప్‌హౌస్‌లో ఒకటవ మోటార్‌ను కంప్యూటర్ ద్వారా ఆన్ చేసి సాగు నీటిని విడుదల చేశారు. కార్యక్రమంలో మంత్రితో పాటు నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, వనపర్తి ఎమ్మెల్యేలు డాక్టర్ కూచకుళ్ల రాజేశ్ రెడ్డి, కశిరెడ్డి నారాయణరెడ్డి, మేఘారెడ్డి, ఇరిగేషన్ సీఈ విజయభాస్కర్‌రెడ్డి, ఎస్ఈ సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. రూ.8 లక్షల కోట్ల అప్పు చేసి కూడా ప్రాజెక్టులను పూర్తి చేయలేకపోయిందని విమర్శించారు. ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ నీటి పారుదల శాఖ మంత్రి హరీశ్‌రావులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోలేదని ఆరోపించారు. వారే ఇప్పుడు ప్రాజెక్టులపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వంపై నిందలు మోపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని ప్రజా ప్రభుత్వంలో రైతులకు అన్ని విధాలా న్యాయం జరుగుతుందని తెలిపారు. ప్రాజెక్టులను పూర్తి చేసి, చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందిస్తామని స్పష్టం చేశారు. అంతకుముందు ఎంజీకే ఎల్ఐ ద్వారా విడుదలైన వరద నీటికి మంత్రితో పాటు ఎమ్మెల్యేలు పూలతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఈఈలు శ్రీనివాస్ రెడ్డి, మాణిక్ ప్రభు, చంద్రశేఖర్, మురళి, డీఈ లోకిలాల్, ఏఈ సంతోశ్ తదితరులు పాల్గొన్నారు.

ఒక్క రేషన్ కార్డయినా ఇచ్చారా?

- వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి
- కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారులతో ఎమ్మెల్యే మేఘారెడ్డి

వనపర్తి టౌన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక్క రేషన్ కార్డయినా ఇచ్చారా? అని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రశ్నించారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ముఖ్యమంత్రి సహాయనిధి, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను పుట్టి పెరిగిన వనపర్తిని అభివృద్ధి చేసేందుకు అహర్నిశలు కృషి చేస్తామన్నారు. పట్టణంలోని 33 వార్డుల్లో ఒకేసారి రూ. 50 కోట్ల వ్యయంతో సీసీ రోడ్లు వేస్తున్నామని తెలిపారు. నియోజకవర్గంలోని 14 తండాల్లో పైలెట్ ప్రాజెక్టు కింద ఎస్టీ రైతులకు సోలార్ ప్లాంట్లను త్వరలోనే అందించనున్నట్లు తెలిపారు. కేసీఆర్ కుటుంబం పూర్తిగా అవినీతిలో కూరుకుపోయిందని, 50 వేల పుస్తకాలు చదివిన వ్యక్తి అసెంబ్లీకి రావాలని డిమాండ్ చేశారు. ట్విట్టర్ పిట్టకు ధైర్యం ఉంటే అయ్యను తీసుకొని అసెంబ్లీకి రావాలని సవాల్ విసిరారు. రేవంత్‌రెడ్డిని విమర్శించే స్థాయి కేటీఆర్‌కు లేదని, అభివృద్ధి, అవినీతిపై చర్చించేందుకు కేటీఆర్‌కు తానుచాలని పేర్కొన్నారు. అనంతరం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. కార్యక్రమంలో వనపర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు శ్రీనివాస్‌గౌడ్, పెబ్బేరు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ప్రమోదినీరెడ్డి, వైస్ చైర్మన్లు రామకృష్ణారెడ్డి, విజయవర్ధన్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సమన్వయకర్త లక్కాకుల సతీశ్, పాకనాటి కృష్ణ, బ్రహ్మంచారి, చీర్ల చందర్, మధుసూదన్‌గౌడ్, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీఏ-2లీగ్‌లో
మహబూబ్‌నగర్ గెలుపు
- 148 పరుగుల తేడాతో విజయం 7



జిల్లెడుబండలోని నర్సరీని పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

గ్రామీణాభివృద్ధి పనులు భేష్

- కితాబిచ్చిన జాతీయ స్థాయి పర్యవేక్షణ బృందం
- గద్వాల మండలం, జిల్లెడుబండలో పర్యటన

గద్వాల, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణాభివృద్ధి పనులు బాగున్నాయని కేంద్ర పర్యవేక్షణ బృందం కితాబిచ్చింది. కేంద్ర ప్రభుత్వం ద్వారా నిర్వహిస్తున్న గ్రామీణ అభివృద్ధి పనులు, పథకాల అమలు తీరును పరిశీలించేందుకు జాతీయ స్థాయి పర్యవేక్షణ బృందం మంగళవారం గద్వాల మండల పరిధిలోని జిల్లెడుబండ గ్రామంలో పర్యటించింది. గ్రామంలో ఉపాధి హామీ, పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పనులను బృందం సభ్యులు సీవీ బాలమురళి, రాజికలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా ప్రజలకు ఉపాధి కల్పించడంతో పాటు గ్రామాల్లో అభివృద్ధికి తోడ్పడే పనులను నిర్వహించడం వల్ల రైతాంగానికి మేలు జరుగుతోందన్నారు. కల్లాలు, భూమి చదును, నీటి పారుదల, భూగర్భ జల వనరుల ఏర్పాటు పనులతో రైతులకు ఉపయోగం కలుగుతుందన్నారు. పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన సీసీ రోడ్ల పనులతో గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన పనుల వల్ల గ్రామీణాభివృద్ధి మెరుగుపడిందన్నారు. కేంద్రం ప్రభుత్వం ఆధ్వర్యంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదలకు అందుతున్నాయన్నారు. హరితహారం పథకంతో గ్రామీణ ప్రాంతాల్లో పచ్చదనం పెరిగిందని తెలిపారు. పనులపై సంతృప్తి వ్యక్తం చేసిన బృందం సభ్యులు, రికార్డులు పూర్తి పారదర్శకంగా లేవని, మెరుగుపరచాలని సూచించారు. కేంద్ర బృందం వెంట ఇన్‌చార్జి ఎంపీడీవో చంద్రకళ, ఏపీవో విజయలలిత, పంచాయతీరాజ్ అధికారి బషీర్, ఏపీఎం పారిజాత, పంచాయతీ కార్యదర్శి కవిత, టెక్నికల్ అసిస్టెంట్ ప్రభాకర్ ఉన్నారు.

గద్వాల మండల
రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌పై దాడి?
- రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు 6

ప్రతిభను ప్రోత్సహించడం
అభినందనీయం
- పదవ బెటాలియన్ కమాండెంట్ జయరాజ్ 6

వేధింపులు భరించలేక
గృహిణి ఆత్మహత్య
- వెల్దండ మండల కేంద్రంలో ఘటన 7

అమ్మవారి ఆలయాల్లో చోరీ 7

మినీ ట్యాంకుబండ్ కల నెరవేరేనా





నత్తనడకన సాగుతున్న ట్యాంకుబండ్ పనులు

- ఏళ్లుగా ఎదురు చూస్తున్న మరికల్ మండల వాసులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు
- వాకింగ్ ట్రాక్ లేక ఇక్కట్లు

మరికల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మరికల్ మండల కేంద్రానికి కిలోమీటర్ దూరంలోనున్న పెద్ద చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా చేయాలనే మండల వాసుల కోరిక ఏళ్లుగా కలగానే మిగలనుంది. నారాయణపేట జిల్లాకు ముఖద్వారమైన మరికల్ మండల కేంద్రంలో నేషనల్ హైవే-167 పక్కన ఉన్న పెద్ద చెరువును గత ప్రభుత్వం 2017 ఆగస్టు 5న మాజీ మంత్రి డాక్టర్ సి.లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి మినీ ట్యాంక్‌బండ్ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. పనులు ప్రారంభించి దాదాపు ఎనిమిది సంవత్సరాలు గడుస్తున్నా కూడా నేటివరకు పూర్తి కాలేదు. నిర్మాణం పనులు 40 శాతం మాత్రమే జరగగా మిగతా 60 శాతం పనులు కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా నత్తనడకన కొనసాగుతున్నాయి. ట్యాంక్‌బండ్ పనులు పూర్తయితే ప్రతీరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో వాకర్లతో పాటు సందర్శకుల తాకిడి పెరగనుంది. ప్రస్తుతం చెరువు అలుగు కట్ట లీకేజీతో నీరు వృథాగా పోతున్నాయి.

కట్ట చుట్టూ చెరువు లోపల పిచ్చిమొక్కలు తొలగించాలని, కట్టపై వాకర్స్‌కు అనుగుణంగా సామర్థ్యం పెంచి వాకింగ్ ట్రాక్, లైటింగ్ సదుపాయం ఏర్పాటు చేయాలని వాకర్లు కోరుతున్నారు.

అలాగే, కట్టకు డబుల్ రోడ్డుకు ఆనుకుని ఉన్న స్థలంలో పార్క్ ఏర్పాటు చేసి టూరిస్ట్ హబ్‌గా తయారు చేయాలన్నారు.

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమైనా ప్రత్యేక శ్రద్ధ తీసుకొని మినీ ట్యాంకుబండ్ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని మండలవాసులు కోరుతున్నారు.

వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలి..



వాకింగ్ ట్రాక్ లేకపోవడంతో ప్రతీరోజు రోడ్లపై వాకింగ్‌కు వెళుతున్నాం. ట్యాంక్‌బండ్ పనులు పూర్తి చేస్తే వాకింగ్ చేయడానికి అనుకూలంగా ఉంటుంది. ప్రభుత్వం వెంటనే స్పందించి మినీ ట్యాంకుబండ్‌ను త్వరగా పూర్తి చేయాలి.

- పోలేమెని రమేష్, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి, మరికల్

సుంకేసుల జలాశయానికి 61,000 క్యూసెక్కుల వరద



సుంకేసుల డ్యాం నుంచి దిగువకు విడుదల అవుతున్న నీరు

రాజోలి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం రాజోలి శివారులో ఉన్న సుంకేసుల జలాశయానికి వరద నీటి ప్రవాహం పెరిగింది. మంగళవారం ఉదయం 61,000 క్యూసెక్కుల వరద వస్తుండటంతో డ్యాం 16 గేట్లు ఎత్తి 63,000 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు డ్యాం అధికారులు తెలిపారు. పూర్తిస్థాయి నీటి నిల్వ 1.20 టీఎంసీలు కాగా ప్రస్తుతం 0.688 టీఎంసీ ఉందని అధికారులు తెలిపారు.

స్థానిక ఎన్నికల్లో గెలుపు మనదే

- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి



కల్వరాలలో కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

పీపనగండ్ల, జూలై 8, (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ అత్యధిక స్థానాలు గెలువబోతోందని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి కార్యకర్తల కు తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని కల్వరాలలో మొహర్రం సందర్భంగా గ్రామ పార్టీ అధ్యక్షుడు ఎండీ సర్దార్ ఇంటికి వచ్చారు. కార్యకర్తలను పలకరించి గ్రామంలో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. బీఆర్ఎస్ పార్టీకి ఆదరణ పెరుగుతుందని, స్థానిక సంస్థ ఎన్నికల్లో కార్యకర్తలు కలిసికట్టుగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ రఘునాథ్‌రెడ్డి, వెంకటేష్, నరసింహరెడ్డి, గోపాల్, రాముడు, భాస్కర్‌రెడ్డి, రమేష్, గోవర్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాల ఆర్థికాభివృద్ధికి కృషి

- డీఆర్‌డీవో పీడీ చిన్న ఓబులేష్



సమావేశంలో మాట్లాడుతున్న చిన్న ఓబులేష్

వంగూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : మహిళా సంఘాల సభ్యుల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని డీఆర్‌డీవో పీడీ చిన్న ఓబులేష్ అన్నారు. ఇందిరా మహిళా శక్తి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం వంగూరులో మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఐకేపీ భవనంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఆర్‌డీవో పీడీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ మహిళా శక్తి పథకం ద్వారా మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించి వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. స్త్రీనిధి ద్వారా వ్యక్తిగత రుణాలను తీసుకొని ఉపాధి పొందాలన్నారు. కార్యక్రమంలో డీపీఎం శ్రీనివాసులు, ఎంపీడీవో బ్రహ్మం, మండల సమాఖ్య అధ్యక్షురాలు నర్మద, కలమ్మ, ఏపీఎం శ్రీనివాసులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యంతో చదువుకోవాలి

- అదనపు కలెక్టర్ అమరేందర్



గిరిజన సంక్షేమ ఉన్నత పాఠశాల విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరీక్షిస్తున్న అదనపు కలెక్టర్ అమరేందర్, డీఈవో రమేష్ కుమార్

మన్ననూర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకొని క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని అదనపు కలెక్టర్ అమరేందర్ అన్నారు. అమ్రాబాద్ మండలం మన్ననూరులోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖాధికారి రమేష్‌కుమార్‌తో కలిసి మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం పథకంలో నాణ్యతాప్రమాణాలను అడిగి తెలుసుకున్నారు. వంటశాలలో వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల తరగతి గదుల్లో విద్యార్థులతో మాట్లాడి వారి సామర్థ్యాలను పరీక్షించారు. ప్రభుత్వ పాఠశాలల్లో వసతులతో కూడిన విద్యను అందిస్తున్నామని, విద్యార్థులు చక్కగా చదువుకొని ప్రయోజకులు కావాలన్నారు. అంతకు ముందు మన్ననూరులో చెంచు మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నడుస్తున్న న్యాప్కిన్ల (రుతురుమాళ్లు) తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. న్యాప్‌కిన్ల నాణ్యతా ప్రామాణాలను పరిశీలించారు. జిల్లా పరిధిలోని 20 కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలకు న్యా ప్కిన్లను పంపిణీ చేసే సామర్థ్యం ఉండేలా చూసుకోవాలని, న్యాప్కిన్ల మా ర్కెటింగ్‌తో మహిళా సంఘాలు ఉపాధి పొంది ఆర్థికంగా అభివృద్ధి సాధి స్తారని అన్నారు. వీరి వెంట ఎంఈవో బాలకిషన్, మహిళా సమాఖ్య బుక్ మేనేజర్ నర్సింహులు పాల్గొన్నారు.

కోస్గి ఠాణా ముందు మాజీ సర్పంచ్ నిరసన



స్టేషన్ ముందు నిరసన తెలుపుతున్న మాజీ సర్పంచ్ హరీశ్

కోస్గి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పేట జిల్లా కోస్గి ఠాణా ముందు మాజీ సర్పంచ్ మంగళవారం సాయంత్రం తన అనుచరులతో నిరసన తెలిపారు. మండలంలోని సర్జఖాన్‌పేట్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ హరీష్, గ్రామ కార్యదర్శి అరుణ గ్రామానికి చెందిన కొందరు తమ విధులకు ఆటంకం కలిగిస్తున్నారని పదిరోజుల క్రితం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ వ్యవహారంపై పోలీసులు కేసు నమోదు చేయలేదు. మాజీ సర్పంచ్ మరోమారు స్టేషన్‌కు వచ్చి కార్యదర్శి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు ఎందుకు నమోదు చేయలేదని నిరసిస్తు స్టేషన్ ముందు నిరసన తెలిపారు. సుమారు రెండుగంటల పాటు నిరసన తెలుపడంతో సమాచారం తెలుసుకున్న జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మెన్ వార్ల విజయ్‌కుమార్ అక్కడకు చేరుకొని వారిని సముదాయించి ఈ వ్యవహారంపై బుధవారం ఉదయం పోలీసులతో మాట్లాడుతామని అక్కడ్నుంచి తీసుకెళ్లాడు.

ఘనంగా బోనాల పండుగ



అభంగపట్నంలో బోనాల ఊరేగింపు



ధన్వాడలో బోనాలతో మహిళలు

కోయిలకొండ, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అభంగపట్నం, అంకిళ్ల గ్రామాల్లో బోనాల పండుగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ధన్వాడలో ఘనంగా బోనాల పండుగ

ధన్వాడ, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పేట జిల్లా ధన్వాడ మండల కేంద్రంలో మంగళవారం బోనాల పండుగను ఘనంగా జరుపుకున్నారు. కోటపక్కా, అప్పసపల్లి, బీసీ కాలనీతో పాటు ఎస్సీ వాడలోని ప్రజలు బోనాల పండుగను జరుపుకున్నారు. ఉదయం పెద్ద బోనంతో అమ్మవారికి అంబలి సమర్పించారు. సాయంత్రం బోనాలతో మహిళలు పురవీధుల గుండా ఊరేగింపుగా వెళ్లి పోలమ్మ దేవతకు నైవేద్యాలు సమర్పించారు. బోనాల పండుగలో పోతురాజు విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో నీరటి నర్సిములునాయుడు, నీరటి రాంచంద్రయ్య, వెంకటయ్య, జి.నర్సిములు, సంద చిన్న బాల్‌నర్సిములు, సంద లక్ష్మన్న, సంద రాములు, ఎస్సీ వాడలో చింతన్‌పువ్వు నర్సిములు, ఈర నాగుల శంకర్, ఊసేనయ్య, పూజారి నర్సిములు, బాలకృష్ణ తదితరు లు పాల్గొన్నారు.

ప్రతిభను ప్రోత్సహించడం అభినందనీయం

- పదవ బెటాలియన్ కమాండెంట్ జయరాజ్
- నడిగడ్డ యువత ఆధ్వర్యంలో పురస్కారాలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న పదవ బెటాలియన్ కమాండెంట్ జయరాజ్

గద్వాల టౌన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : చదువులో రాణిస్తూ ప్రతిభను చాటుతున్న విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీయని బీచుపల్లి పదవ బెటాలియన్ కమాండెంట్ జయరాజ్ అన్నారు. జై నడిగడ్డ యువత ఇస్తున్న ప్రోత్సాహాన్ని విద్యార్థులు అంది పుచ్చుకోవాలన్నారు. మంగళవారం పట్టణంలోని మహారాణి ఆది లక్ష్మీదేవమ్మ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జై నడిగడ్డ యువత ఆధ్వర్యంలో పదవ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ ఫలితాల్లో టాపర్‌లుగా నిలిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను కమాండెంట్ చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో మాట్లాడిన ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ కలందర్ బాషా, తల్లిదండ్రుల కలలను సాకారం చేసేందుకు విద్యార్థులు పట్టుదలతో శ్రమించాలన్నారు. నిర్దేశిత లక్ష్యాన్ని ఎంచుకుని ప్రణాళికాబద్ధంగా చదివి ఉన్నత స్థానాన్ని చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో యువత నాయకులు రామకృష్ణ ముదిరాజ్, శ్రీనివాసులు, బీచుపల్లి, అంజి ముదిరాజ్, వీరేష్, తిమ్మప్ప, రమేష్ గడ్, నరసింహులు గౌడ్, మధు గౌడ్, గట్టన్ననాయుడు, అధ్యాపకులు మహేందర్, రామాంజేయులు గౌడ్ ఉన్నారు.

సెల్‌ఫోన్ల అప్పగింత



బాధితులకు సెల్‌ఫోన్లను అప్పగిస్తున్న ఎస్ఐ

ఉండవల్లి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఉండవల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న బాధితులకు సెల్‌ఫోన్లు అప్పగించామని ఎస్ఐ శేఖర్ తెలిపారు. మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అందించామని తెలిపారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ ఫిర్యాదుల ఆధారంగా సీఈఐఆర్ పోర్టల్ టెక్నాలజీ సహాయంతో ఏడు సెల్‌ఫోన్లను గుర్తించామని, వాటి విలువ రూ.90వేలు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు హుస్సేన్, నగేష్ తదితరులు ఉన్నారు.

పోగొట్టుకున్న ల్యాప్‌టాప్ అప్పగింత



ల్యాప్‌టాప్‌ను అప్పగిస్తున్న కల్వకుర్తి ఎస్ఐ మాధవరెడ్డి

కల్వకుర్తి, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి పట్టణానికి చెందిన బల్వంత్‌రెడ్డి పోగొట్టుకున్న ల్యాప్‌టాప్‌ను మంగళవారం ఆయనకు అందజేసినట్లు కల్వకుర్తి ఎస్ఐ మాధవరెడ్డి తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం బల్వంత్‌రెడ్డి లాప్‌టాప్‌ను పోగొట్టుకోగా అందిన ఫిర్యాదు మేరకు క్రైం పార్టీ కానిస్టేబుల్ చిరంజీవి, నజీర్ ల్యాప్‌టాప్‌ను గుర్తించారని పేర్కొన్నారు. గుర్తించిన ల్యాప్‌టాప్‌ను బాధితునికి అందజేశామని ఎస్ఐ తెలిపారు.

రాచూరులో పర్యటించిన ఎస్ఎస్‌జీ సభ్యులు

వెల్దండ, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని రాచూరు గ్రామంలో మంగళవారం స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్ సభ్యులు పర్యటించారు. ఈ సందర్భంగా ఎస్ఎస్‌జీ ఆర్ఐ లింగమయ్య మండల అధికారులతో కలిసి గ్రామంలో ఇంటింటికి వెళ్లి స్వచ్ఛతపై తీసుకుంటున్న చర్యలపై వివరాలు అడిగితెలుసుకున్నారు. పరిసరాల పరిశుభ్రతకు గ్రామ పంచాయతీలు ఎలా పనిచేస్తున్నాయని ఆరాతీశారు. మురికికాల్వలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని, ప్రభుత్వం ద్వారా గ్రామాలకు అందుతున్న పథకాలను ప్రజలకు తెలియజేసి అవగాహన కల్పించాలని లింగమయ్య సూచించారు. కార్యక్రమంలో ఏపీడీ చంద్రశేఖర్, ఎంపీడీవో లక్ష్మణ్ ఉన్నారు.


హజ్‌యాత్రకు దరఖాస్తు చేసుకోవాలి



హజ్‌యాత్ర కోసం దరఖాస్తుల ప్రక్రియను ప్రారంభిస్తున్న హజ్‌సొసైటీ సభ్యులు

మహబూబ్‌నగర్ అర్బన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : హజ్‌యాత్రకు జిల్లాకు చెందిన వారు దరఖాస్తు చేసుకోవాలని హజ్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు మహమూద్‌అలీ అన్నారు. జిల్లా కేంద్రంలోని వక్ఫ్ కాంప్లెక్స్‌లో గల ఆ సంఘం కార్యాలయంలో మంగళవారం 2026 దరఖాస్తుల ప్రక్రియను ప్రారంభించి, మాట్లాడారు. నేటి నుంచి ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రాంభమైందని, ఈనెల 31 తేదీ వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. జిల్లా నుంచి హజ్‌యాత్రకు వెళ్లే వారు పాస్‌పోర్టు, ఆధార్‌కార్డు, బ్యాంక్ పాస్‌బుక్, ఓటర్ ఐడీ, వాటర్, గ్యాస్ బిల్, విద్యార్హత, వృత్తి, బడ్లగ్రూప్ తదితర ధ్రువపత్రాలతో ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కోరారు. సొసైటీ తరుపున ఉచితంగా ఆన్‌లైన్ చేస్తామని, వివరాలకు సంఘ కార్యాలయంలో సంప్రందించాలని కోరారు. ప్రధాన కార్యదర్శి మహ్మద్ మెహరాజ్, రావుఫ్‌పాష, సత్తార్, మహ్మద్‌రఫీక్, ఖాజానిజాముద్దీన్, ఫయాజుద్దీన్, సయ్యద్ నిజాముద్దీన్, అహ్మద్‌పాష, ముసా, రహెమాన్, అర్షద్‌అలీ పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుతో రైతుకు లాభం



రైతువేదికలో మాట్లాడుతున్న ఏడీఏ రాంపాల్

పాలమూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : ఆయిల్ పామ్ సాగుతో రైతులు లాభం పొందవచ్చని ఏడీఏ వ్యవసాయాధికారి రాంపాల్, ఎంఏవో శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మహబూబ్‌నగర్ మండలం దివిటిపల్లి రైతువేదికలో వ్యవసాయశాఖ, ఉద్యానశాఖల ఆధ్వర్యంలో రైతువేదికలో ఆయిల్ పామ్ సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ పంటకు ప్రభుత్వం డ్రిప్‌పై అందిస్తున్న సబ్సిడీలు నాలుగేళ్ల పాటు (మొదటి పంట వచ్చే వరకు) అందిస్తున్న సహకారాన్ని రైతులు పొందవచ్చన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 4300 ఎకరాల్లో రైతులు ఆయిల్ పామ్ సాగు చేస్తున్నట్లు తెలిపారు. 2025-26 సంవత్సరానికి 1500 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు లక్ష్యంగా నిర్ధారించినట్లు వివరించారు. కంపెనీ జిల్లా మేనేజర్ మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో ఆయిల్ పామ్ గెలలు కలెక్షన్ సెంటర్స్ నుంచి సేకరించి రైతుల ఖాతాలో వారం రోజుల్లో డబ్బు జమచేస్తున్న విధానాన్ని వివరించారు.

నేషనల్ ఫుట్‌బాల్ క్యాంపునకు జిల్లావాసి



వీరేష్

గద్వాల అర్బన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : గత నెల 28న నిజామాబాద్ జిల్లాలో జరిగిన అండర్-15 రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా తరపున గద్వాలకు చెందిన వీరేష్ నేషనల్ ఫుట్‌బాల్ క్యాంప్‌కు ఎంపికయ్యారని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోధ్యాయురాలు రేణుకదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

రైస్‌మిల్లు సీజ్

- 75,331 క్వింటాళ్ల ధాన్యం గోల్‌మాల్
- సివిల్ సప్లయ్ అధికారుల తనిఖీల్లో బయటపడ్డ బాగోతం
- మిల్లు యజమానిపై కేసు నమోదు



రైస్‌మిల్లును తనిఖీ చేసి వివరాలను వెల్లడిస్తున్న సివిల్ సప్లయ్ అధికారులు

కోస్గి, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : 75,331 క్వింటాళ్ల ధాన్యం పక్కదారి పట్టిందని నారాయణపేట జిల్లా కోస్గి పట్టణంలో సివిల్ సప్లయ్ అధికారులు మంగళవారం ఓ రైస్‌మిల్లును సీజ్ చేశారు. సివిల్ సప్లయ్ డీసీఎస్‌ఓ బాలరాజు పట్టణంలోని లక్ష్మీనరసింహ రైస్‌మిల్లును ఆకస్మికంగా తనిఖీ చేశారు. మిల్లులో ప్రభుత్వం కేటాయించిన కోటా కంటే చాలా తక్కువ ధాన్యం ఉండటంతో అధికారులు ఆశ్చర్యానికి గురయ్యారు. ధాన్యం ఏదీఅని అడగ్గా మిల్లు యజమాని నీళ్లు నమలడంతో గోల్‌మాల్ జరిగిందని నిర్ధారణకు వచ్చి కేసు నమోదు చేశారు. ఈ విషయంపై డీఎంకు నివేదిక పంపుతామని అధికారులు చెప్పారు. తనిఖీల్లో సివిల్ సప్లయ్ డీటీ భాస్కర్, తాహసీల్దార్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

గద్వాల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌పై దాడి?

- రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

గద్వాల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): గద్వాల మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌పై మంగళవారం దాడి జరిగింది. తహసీల్దార్ మల్లికార్జున్ ఆర్ఐ రామక్రిష్ణ కథనం మేరకు ఆ వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని పరమాల శివారులో ప్రభుత్వ ఉద్యోగికి మరో ముగ్గురు రైతులకు భూ వివాదం ఉంది. ఈ విషయంపై కోర్టుకు వెళ్లారు. కోర్టు తీర్పు ఇవ్వడంతో పాటు రెవెన్యూ అధికారులకు సూచనలు చేసింది. కాగా మంగళవారం కోర్టు ఉత్తర్వులకు విరుద్ధంగా ప్రభుత్వ ఉద్యోగి భూమిని దున్నుతుండగా బాధిత రైతులు తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఆర్ఐ రామక్రిష్ణను పరిశీలన కోసం పంపానని తహసీల్దార్ తెలిపారు. అక్కడకు వెళ్లిన ఆర్ఐతో ప్రభుత్వ ఉద్యోగి వాగ్వాదానికి దిగడంతో పాటు దుర్భాషలాడి దాడిచేసే విధంగా భయభ్రాంతులకు గురిచేశాడని తెలిపారు. దీంతో వెంటనే రూరల్ పోలీస్ స్టేషన్‌లో సదరు ప్రభుత్వ ఉద్యోగిపై ఫిర్యాదు చేసినట్లు తహసీల్దార్ తెలిపారు. కాగా ఈ విషయంపై ఎస్సై శ్రీకాంత్‌ను వివరణ కోరగా ఫిర్యాదు అందింది విచారణ చేస్తామని తెలిపారు.

ఇసుక టిప్పర్, ట్రాక్టర్ల పట్టివేత

రాజాపూర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : అనుమతి లేకుండా కృత్రిమ ఇసుకను తయారు చేయడానికి మట్టిని తరలిస్తున్న మూడు ట్రాక్టర్లతో పాటు ఒక ఎక్స్‌కవేటర్, కృత్రిమ ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివానందం మంగళవారం తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం.. మండల కేంద్రంతో పాటు మండలంలోని రాయపల్లి గ్రామ శివారులోని స్థానిక దుందుభీ వాగులో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో ఇసుకను తయారు చేస్తున్న వాటిని పట్టుకున్నారు. ఎలాంటి పత్రాలు లేకపోవడంతో ఇసుకను తయారు చేసి విక్రయిస్తున్న రాజు, వెంకటసాయి, శ్రీరామ్, శ్రీనులపై కేసు నమోదు చేసి, పట్టుబడిన ట్రాక్టర్లను, టిప్పర్‌తో పాటు ఎక్స్‌కవేటర్‌ను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

మహమ్మదాబాద్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలో పలు గ్రామాల్లో కిష్టపల్లి వాగు నుంచి ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తుండటంతో మంగళవారం మధ్యాహ్నం పోలీసులు పట్టుకున్నారు. ట్రాక్టర్ల యజమానులు హన్వాడకు చెందిన రాములు, కంచనపల్లికి చెందిన బాలరాజుపై కేసు నమోదు చేశారు.

టేకు దుంగలను ఎత్తుకెళ్లిన దుండగులు

పెద్దకొత్తపల్లి, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని లక్ష్మాపూర్ గ్రామ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు టేకు చెట్లను నరికిన సంఘటన మంగళవారం వెలుగు చూసింది. వివరాలోకి వెళ్తే.. చిన్నకొత్తపల్లి గ్రామానికి చెందిన ఎత్తం హుస్సేన్ అనే రైతుకు వ్యవసాయ భూమి లక్ష్మాపూర్ దగ్గర ఉంది. తన భూమిలో టేకు వృక్షాలను పెంచుతున్నారు. సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు టేకు చెట్లను నరికి తీసుకెళ్లారని బాధిత రైతు తెలిపారు. టేకు వృక్షాలను నరకడం వలన రూ.50 వేలు నష్టం జరిగిందని వాపోయారు. లక్ష్మాపూర్ గ్రామానికి అతి సమీపంలో ఉన్న తన వ్యవసాయ పొలంలో చెట్లను నరికిన వ్యక్తులను గుర్తించి చట్టపరంగా శిక్షించాలని పెద్దకొత్తపల్లి పోలీసులను కోరారు. జరిగిన సంఘటనతో ఆర్థికంగా నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు ఎత్తం హుస్సేన్ విజ్ఞప్తి చేశారు.

క్రైం కార్నర్

అమ్మవారి ఆలయాల్లో చోరీ

» ఎల్లమ్మదేవి మెడలో పుస్తెలతాడు అపహరణ



మెడలో తాళి చోరీకి గురైన ఎల్లమ్మ దేవి విగ్రహం

అయిజ, జూలై 8 (ఆంధ్రజ్యోతి): అయిజ సమీపంలోని తూముకుంట రహదారిలో ఉన్న జములమ్మ, ఎల్లమ్మ, ముక్కిడమ్మ, పరశురాముల ఆలయాల్లో చోరీ జరిగింది. ఆ వివరాలు.. మంగళవారం వేకువజామున ఓ భక్తుడు పూజ చేసేందుకు గుడికి వెళ్లగా తాళాలు పగులగొట్టి ఉండడంతో చోరీ జరిగినట్లు గుర్తించాడు. విషయాన్ని ఆలయ కమిటీ చైర్మన్ నాగన్‌గౌడుకు తెలిపాడు. ఆయన వెంటనే ఆలయానికి చేరుకుని పరిశీలించగా ఎల్లమ్మ గుడి తాళాలు పగలగొట్టి, అమ్మవారి మెడలోని పుస్తె చోరీ చేశారు. హుండీపై ఉన్న వెండి లక్ష్మీదేవి విగ్రహాన్ని హెల్డింగ్ కట్టరో తొలగించే ప్రయత్నం చేసి, రాకపోవడంతో వదిలేశారు. ఈ సమాచారం అందుకున్న ఎస్‌ఐ శ్రీనివాసరావు సిబ్బందితో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

వెల్కిచర్లలో చోరీ

» నగదు, వెండి ఎత్తుకెళ్లిన దొంగలు



దొంగలు పగులగొట్టిన బీరువా, చిందరవందరగా వేసిన దుస్తులు

భూత్పూర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని వ్యక్తులు తాళం వేసిన ఇంట్లో చొరబడి బీరువా పగుల గొట్టి నగదుతో పాటు వెండి వస్తువులు దోచుకెళ్లారు. ఈ సంఘటన మండలంలోని వెల్కిచర్ల గ్రామంలో చోటుచేసుకుంది. బాధితుడు సామల యాదయ్య కథనం ప్రకారం.. ఈ నెల 6వ తేదీన బంధువుల ఇంట్లో శుభకార్యానికి కుటుంబ సభ్యులతో కలిసి కౌకుంట్ల గ్రామానికి వెళ్లారు. తిరిగి మంగళవారం ఉదయం ఇంటికి రాగా, తాళం విరగొట్టి ఉండటాన్ని చూసి ఒక్కసారిగా అవాక్కయ్యారు. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరులో ఉన్న రూ.50వేల నగదుతో పాటు పది తులాల వెండి గొలుసులు ఎత్తుకెళ్లినట్లు యాదయ్య పేర్కొన్నాడు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేయగా సంఘటన స్థలానికి ఎస్‌ఐ చంద్రశేఖర్‌తో పాటు క్లూస్ టీం బృందం వచ్చి పరిశీలించారు. దొంగల వేలిముద్రలను క్లూస్ టీం పోలీసులు సేకరించారు. అనంతరం బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసు దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

స్కూలు బస్సు సీజ్



బస్సును పరిశీలిస్తున్న అధికారులు

అయిజ, జూలై 8 (ఆంధ్రజ్యోతి): అయిజలోని కొత్తబస్టాండ్ సమీపంలో ఉన్న కాకతీయ మెమోరియల్ పాఠశాల బస్సును అధికారులు సీజ్ చేశారు. జిల్లా ట్రాన్స్‌పోర్టు అధికారి వెంకటేశ్వరరావు సోమవారం సాయంత్రం ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలకు చెందిన బస్సులను పరిశీలించారు. ఫిట్‌నెస్, అనుమతి పత్రాలను పరిశీలించారు. బస్సుకు అనుమతులు సక్రమంగా లేని కారణంగా సీజ్ చేసినట్లు డీటీవో వెంకటేశ్వరరావు తెలిపారు.

రాజాపూర్‌లో దొంగకు దేహశుద్ధి

కోడేరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలం రాజాపూర్ గ్రామంలో కరెంటు వైర్లు (కెబుల్ వైర్లు) దొంగిలించిన దొంగలకు దేహశుద్ధి చేసి పంచాయితీ పెట్టిన సంఘటన చోటు చేసుకున్నది. మంగళవారం అదే గ్రామానికి చెందిన బోయ మద్దిలేటి, ఇంకో బోయ మద్దిలేటి ఇద్దరూ కలిసి అదే గ్రామానికి చెందిన రైతుల కరెంటు వైర్లు దొంగిలించి కాల్చి రాగి వైరు తీసి కొల్లాపూర్ మండలం సింగోటం గ్రామంలో విక్రయిస్తుండగా వారిని గుర్తించి గ్రామస్థులు పట్టుకొని గ్రామానికి తీసుకువచ్చి దేహశుద్ధి చేసి వైర్లు దొంగిలించిన యజమాని ఇంటి ముందు కూర్చోబెట్టినట్లు గ్రామస్థులు తెలిపారు. విషయమై స్థానిక ఎస్‌ఐ జగదీశ్వర్‌ను వివరణ కోరగా తమకు ఎలాంటి సమాచారమూ లేదని అన్నారు.

కారు ఢీకొని మహిళ మృతి

మూసాపేట, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : అతివేగం.. అజాగ్రత్తగా కారును నడపడంతో ఓ మహిళ మృతి చెందిన సంఘటన మండలంలోని పోల్కంపల్లి వద్ద సోమవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్‌ఐ వేణు కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి చెందిన ఎండీ షాదీ అనే యువకుడు కారులో పోల్కంపల్లిలో తమ బంధువుల వద్దకు వస్తున్నాడు. గ్రామంలో రోడ్డుపై నడుచుకుంటు వెళ్తున్న గంజీ స్వప్న(24)ను అతివేగంగా ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. అదే చోట వెళ్తున్న బోల చెన్నయ్య కుమారుడు శివను సైతం ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడగా జిల్లా ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ ఎండీ షాదీపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతురాలికి భర్త శివరాములుతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

రాజాపూర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని కుచ్చర్కల్ గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. నవాబ్‌పేట మండలం ఇప్పటూర్ గ్రామానికి చెందిన బుచ్చయ్య (60) ద్విచక్ర వాహనంపై రాజాపూర్ నుంచి వెళ్తుండగా కుచ్చర్కల్ గ్రామంలో ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ ఢీ కొనడంతో మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఎస్‌ఐ శివానందంను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

వేధింపులు భరించలేక గృహిణి ఆత్మహత్య

వెల్దండ, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : భర్త, కుటుంబ సభ్యుల వేధింపులు భరించలేక మండల కేంద్రంలో ఓ గృహిణి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కోనేరు అశ్విని (23) అనే గృహిణి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్‌ఐ కురుమూర్తి తెలిపారు. మృతురాలి తండ్రి దశరథం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ తెలిపిన వివరాలు.. మండల కేంద్రమైన వెల్దండకు చెందిన కోనేరు వెంకటేష్‌కు మూడేళ్ల క్రితం ఊర్కొండ మండలం జగ్‌బోయిన్‌పల్లి గ్రామానికి చెందిన అశ్వినితో వివాహం జరిగింది. వెంకటేష్ తన భార్యపట్ల తరచూ వేధింపులకు పాల్పడేవాడు. మంగళవారం ఉదయం 10 గంటల సమయంలో 'నీ కూతురును తీసుకుని వెళ్లాలి' అని వెంకటేష్ తనకు చెప్పాడని మృతురాలి తండ్రి దశరథం తెలిపారు. మరో గంట తర్వాత అతని చిన్నమ్మ అయిన చెన్నమ్మ ఫోన్‌చేసి నీ కూతురు ఉరివేసుకుని చనిపోయిందని తెలిపిందని పేర్కొన్నాడు. తన కూతురు మృతిపట్ల అనుమానం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, దశరథం ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

జర్నలిస్టుల పాత్ర కీలకం

» రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

» నాగర్‌కర్నూల్‌లో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా మహాసభ

» ముఖ్య అతిథులుగా హాజరైన మంత్రి జూపల్లి, ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి



టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా మహాసభలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

నాగర్‌కర్నూల్‌టౌన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో జర్నలిస్టుల పాత్ర కీలకమని రాష్ట్ర ఎక్సైజ్, టూరిజంశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని రూబీ గార్డెన్‌లో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) 4వ జిల్లా మహాసభ నిర్వహించారు. టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు గోలి సుదర్శన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ జిల్లా మహాసభకు ముఖ్య అతిథులుగా మంత్రి జూపల్లి కృష్ణారావుతో పాటు ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి, టీయూడబ్ల్యూజే(ఐజేయూ) రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ హాజరయ్యారు.

ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, అర్హులైన జర్నలిస్టులందరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామన్నారు. కాని కొందరు జర్నలిస్టులు ఆర్థికంగా ఉన్నా, ఇళ్ల స్థలాల పేరుతో రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి మాట్లాడుతూ కత్తి కంటే కలం గొప్పదని, రాజకీయాల్లోకి వచ్చాకే జర్నలిస్టుల విలువ తెలిసిందన్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు ఇచ్చేందుకు తన వంతుగా సహకరిస్తానన్నారు.

కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే(ఐజేయూ) రాష్ట్ర కార్యదర్శి గుండ్రాతి మధుగౌడ్, జిల్లా, అసెంబ్లీ, మండల యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బోధనోపకరణాలతో బోధించాలి



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న మండల విద్యాధికారి భాస్కర్ శర్మ

కోడేరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీష్ మీడియంలో బోధన కొనసాగుతున్నందున ఉపాధ్యాయులు వారి తగినట్లుగా బోధనోపకరణాలను ఉపయోగించి బోధన చేయాలని ఉపాధ్యాయులకు మండల విద్యాధికారి భాస్కర్‌శర్మ సూచనలు చేశారు. మంగళవారం మండల పరిధిలోని నర్సాయిపల్లి , బాడుగదిన్నె ప్రాథమిక పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో పాఠశాల పరిసరాలను పరిశీలించి విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం అందించాలని ఉపాధ్యాయులను, వంట ఏజెన్సీ వారిని ఆదేశించారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించి విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. విద్యార్థులకు నిర్వహించే ఎఫ్‌ఎల్‌ఎన్ ప్రారంభ పరీక్ష వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎత్తం కాంప్లెక్స్ సీఆర్పీ సాయికుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

ప్రొఫెసర్లకు ఏడీఎంఈలుగా పదోన్నతులు

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం), జూలై 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆయా మెడికల్ కళాశాలలు, జనరల్ ఆసుపత్రుల లో ఉన్న ప్రొఫెసర్ పోస్టులకు ఏడీఎంఈ (అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్)లుగా పదోన్నతులు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలోని పలువురు ప్రొఫెసర్లకు పదోన్నతులు లభించాయి. అందులో మహబూబ్‌నగర్ జనరల్ ఆసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ప్రొఫెసర్ డాక్టర్ సంపత్‌కుమార్ సింగ్ పదోన్నతిపై నారాయణపేట జిల్లా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా వెళ్లారు. అయితే ప్రస్తుతం ఉన్న సూపరింటెండెంట్ పోస్టులో వైద్యకళాశాల డైరెక్టర్ ఉండడంతో ఆ పోస్టు ఖాళీ చూపించలేదు. అయితే ఇన్‌చార్జి బాధ్యతలు ఎవరికి ఇస్తారనే దానిపై మాత్రం స్పష్టత లేదు. ఉన్నవారిలో పీడియాట్రిక్, రేడియాలజీ, ఆర్థోపెడిక్ ప్రొఫెసర్లు సీనియర్లుగా ఉన్నారు. కానీ వారు ముందు నుంచే ఇన్‌చార్జి బాధ్యతలు తీసుకోవడానికి ఆసక్తి చూపమని చెప్పేశారు. ఇదిలా ఉండగా సర్జరీ విభాగాధిపతిగా ఉన్న దీన్ దయాల్ భంగ్‌కు వికారాబాద్ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పోస్టింగ్ ఇచ్చారు. నారాయణపేట జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా హన్మకొండ కేఎంసీ రేడియాలజీ విభాగాధిపతి డాక్టర్ స్వర్ణకుమారికి ఇచ్చారు. వికారాబాద్ ఆసుపత్రిలో సర్జరీ విభాగాధిపతి డాక్టర్ మల్లికార్జున్‌కు వనపర్తి మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా, సూపరింటెండెంట్‌గా సంగారెడ్డి జీఎంసీలోని ఈఎన్‌టీ ప్రొఫెసర్ శోభన్‌బాబుకు పోస్టింగ్ ఇచ్చారు.

మహబూబ్‌నగర్ జనరల్ ఆసుపత్రిలోని ఓబీజీ ప్రొఫెసర్‌గా ఉన్న డాక్టర్ సంగీతకు సిద్ధిపేట జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా ఇచ్చారు. కొత్తగా మంజూరైన కొడంగల్ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా సంగారెడ్డి ఎస్‌ఎంసీ జనరల్ సర్జరీ విభాగధిపతి డాక్టర్ రాజుకు, సూపరింటెండెంట్‌గా యాదాద్రి భోనగిరి జీఎంసీ ఓబీజీ ప్రొఫెసర్ డాక్టర్ మాలతికి పోస్టింగ్ ఇచ్చారు. జోగులాంబ గద్వాల్ జిల్లా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా మహేశ్వరం జీఎంసీ టీడీ, సడీ ప్రొఫెసర్ డాక్టర్ మహబూబ్‌ఖాన్‌కు, ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా గాంధీ మెడికల్ కళాశాల పీడియాట్రిక్ ప్రొఫెసర్ డాక్టర్ నాగార్జునకు పదోన్నతి కల్పించారు.

అదే విధంగా నాగర్‌కర్నూల్ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా నిజామాబాద్ జీఎంసీ పీడియాట్రిక్ ప్రొఫెసర్ డాక్టర్ ఉషారాణికి ఇచ్చారు.

విజేతగా నిలవాలి

» జిల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షుడు ఎన్పీ వెంకటేశ్

» రాష్ట్రస్థాయి టోర్నీకి తరలిన జిల్లా ఫుట్‌బాల్ జట్టు



జిల్లా క్రీడాకారులతో ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎన్పీ వెంకటేశ్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ టోర్నీలో జిల్లా బాలికల జట్టు విజేతగా నిలవాలని ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు, జిల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షుడు ఎన్పీ వెంకటేశ్ అన్నారు. మంచిర్యాల జిల్లా రామకృష్ణపురంలో నేటి నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి బాలికల జూనియర్ ఫుట్ బాల్ టోర్నీలో పాల్గొనే ఉమ్మడి జిల్లా బాలికల జట్టు తరలివెళ్లింది. మంగళవా రం స్టేడియం మైదానంలో ఏర్పాటు చేసిన కా ర్యక్రమంలో జట్టు క్రీడాకారులలు ఎం.నిఖిత, ఎంవీ.ధ్యాన అంజలి, ఆనందవర్షిని, వినుతశ్రీ, రుత్విక, సునీత, అర్తి, వర్ష, అనూష, మణిదీపి కా, నిహారిక, సావిత్రి, పూజ, స్వాతి, నిత్య, సాన్విత, రిషితరాజ్‌ను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడ ల్లో రాణించాలని, క్రీడాకారులకు బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు.

జిల్లాలో ప్రతిభ గల క్రీడాకారులకు కొదవ లేదని, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్నారని గుర్తుచేశారు. జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు శంక ర్ లింగం, ప్రధాన కార్యదర్శి భానుకిరణ్, కోశాధికారి నగేష్, నందకిశోర్, ప్రకాష్, పూజ, వెంకట్‌రాములు, కోచ్, మేనేజర్లు లక్ష్మణ్‌గౌడ్, భార్గవి, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ సమతుల్యతను కాపాడాలి

» పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్



మాట్లాడుతున్న పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్

పాలమూరు యూనివర్సిటీ, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ సమతుల్యతను కాపాడాలని వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం పాలమూరు యూనివర్సిటీలోని పీజీ కళాశాలలోని పర్యావరణ శాస్త్రం విభాగం ఆధ్వర్యంలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ప్రథమ సంవత్సరం విద్యార్థులకు స్వాగత కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. పర్యావరణ శాస్త్రం చదివిన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, సాంకేతిక రంగాల్లో పర్యావరణం ముఖ్య భూమిక పోషిస్తుందన్నారు. ప్రస్తుత పరిశోధనలు అన్ని పర్యావరణానికి అనుకూలంగా కొనసాగాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

హెచ్‌సీఏ 2లీగ్‌లో మహబూబ్‌నగర్ గెలుపు

» 148 పరుగుల తేడాతో విజయం

» ఎండీసీఏ సెక్రటరీ రాజశేఖర్



విజయం సాధించిన మహబూబ్‌నగర్ జట్టు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) 2డే లీగ్ టోర్నీలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జట్టు 148 పరుగుల తేడాతో గెలిచింది. మొదటి రోజు బ్యాటింగ్ చేసిన ఉమ్మడి మహబూబ్‌నగర్ జట్టు మొదటి ఇన్నింగ్‌లో 68.1 ఓవర్లలో 243 పరుగులకు ఆలౌట్ అయ్యింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రాకేష్ ఎలెవన్ జట్టు మొదటి ఇన్నింగ్‌లో 20 ఓవర్లలో మొదటి రోజులు 6 వికెట్లు నష్టానికి 59 పరుగులు చేసింది. మంగళవారం హైదరాబాద్ ఘట్‌కేసర్‌లోని మార్క్ క్రికెట్ మైదానంలో రెండో బ్యాటింగ్ దిగిన రాకేష్ ఎలెవన్ జట్టు 36 పరుగుల జోడించి 95 పరుగులకు కుప్పకూలింది.

జిల్లా బౌలర్లలో ఎన్.గగన్ 5 వికెట్లు, ముఖీదుద్దీన్, జశ్వంత్ చేరో రెండు వికెట్లు, కె.శ్రీకాంత్ 1 వికెట్ తీసి జట్టు విజయానికి కృషి చేశారు. 2డే లీగ్ జట్టు విజయం సాధించడం పట్ల జట్టు క్రీడాకారులు, కోచ్ అబ్దుల్లాను జిల్లా క్రికెట్ సంఘం సెక్రటరీ రాజశేఖర్ అభినందించారు.

తరగతి గదికి తాళం

» బల్లు రాలేదని వేసిన అధికార పార్టీ నాయకుడు



ధన్వాడలో ఉర్దూ మీడియం పాఠశాల గదికి తాళం

ధన్వాడ, జూలై 8 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా ధన్వాడ మండల కేంద్రంలోని ఉర్దూ మీడియం పాఠశాలలో అదనపు గదుల నిర్మాణానికి ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాల నిధుల కింద రూ.3 లక్షల 50 వేలు మంజూరు చేసింది. పనిని అధికార పార్టీకి చెందిన స్థానిక నాయకుడు చేపట్టి నిర్మాణాన్ని పూర్తి చేశాడు. నిర్మాణం పూర్తయి ఆరునెలలు అయ్యింది. ప్రస్తుతం విద్యా సంవత్సరం కూడా ప్రారంభం అయ్యింది. అయితే నిర్మాణం పూర్తి చేసిన సంబంధిత కాంట్రాక్టర్ పాఠశాల గదిని ఉపాధ్యాయులకు అప్పగించలేదు. తన కు రూ.3.50 లక్షలకు గాను కేవలం రూ.75 వేలు మాత్రమే వచ్చాయని, పూర్తి నిధులు తనకు అందే దాకా గదిని అప్పగించనని తాళం వేసుకొని తన వద్దే ఉం చుకున్నాడు. ఈ విషయమై సంబంధిత కాంట్రాక్టర్‌ను వివరణ కోరగా బిల్లుల కో సం అధికారుల చుట్టూ తిరిగానన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో విజేతలుగా నిలవాలి

» జిల్లా కార్యదర్శి విజయ్‌కుమార్



రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు బయలుదేరిన జిల్లా జట్టు

గద్వాల అర్బన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ టోర్నీలో జిల్లా జట్టు విజేతగా నిలవాలని ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి విజయ్‌కుమార్ అన్నారు. తెలంగాణ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఆదిలాబాద్‌లో నిర్వహించే జూనియర్ మహిళల ఫుట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా జట్టు బయలుదేరి వెళ్లింది. అనంతరం విజయ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరచి జిల్లాకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలన్నారు.

జిల్లా మహిళా ఫుట్‌బాల్ జట్టు బయలుదేరుతున్న సందర్భంగా క్రీడాకారిణులను అభినందించారు. కార్యక్రమంలో పీఈటీలు స్రవంతి, ఆనంద్‌కు మార్, రాజారెడ్డి, క్రీడాకారిణులు ఉన్నారు.

మద్దిమడుగు ఆలయం హుండీ లెక్కింపు

పదర, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మద్దిమడుగు పబ్బతి ఆంజనేయస్వామి ఆలయం హుండీ లెక్కింపును దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరి, కార్యనిర్వాహక అధికారి రంగాచారి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రూ. 38లక్షల27వేల580 నగదు ఆదాయంతో పాటు 2కేజీల 310గ్రాముల మిశ్రమ వెండీ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రాములు నాయక్, ఎస్‌ఐ సద్దాం హుసేన్, ఆలయ అర్చకులు, అధికారులు వీరయ్య శాస్త్రి, రఘు శర్మ, అజయ్ ఉన్నారు.

సేవ చేయడం మనందరి బాధ్యత



మహబూబ్‌నగర్ పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఏబీవీపీ విద్యార్థులు

మహబూబ్‌నగర్ విద్యా విభాగం, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : మాతృభూమికి సేవ చేయడం విద్యార్థులుగా మనందరి బాధ్యత అని తెలంగాణ ప్రాంత సహ సంఘటన కార్యదర్శి ఆర్.విష్ణువర్ధన్ అన్నారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ పాలమూరు శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ విద్యార్థి దినోత్సవాన్ని పురస్కరించుకుని పాలమూరు నగరంలో మహా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో వేలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ 1949 జూలై 9 ఢిల్లీ యూనివర్సిటీలో అఖిల భారతీయ విద్యార్థి సంఘం ఏర్పడి, నేడు ప్రపంచంలోనే అతిపెద్ద సంఘంగా అవతరించందన్నారు. పాలమూరు విభాగ్ సంఘటన కార్యదర్శి నరేంద్ర, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నరేష్ తేజ, రాష్ట్ర కార్య సమితి సభ్యురాలు సౌమ్య, జిల్లా కన్వీనర్ సతీష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శివసాగర్, నగర కార్యదర్శి శివ, శ్రావణి, శివాజీ, అరుణ్, వరుణ్, జయశ్రీ, సుష్మ, ఉదయ్ శ్రీ, మహేష్ పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ..

పశువుల్లో గొంతువాపు వ్యాధిపై అప్రమత్తం

- డాక్టర్ సంతోష్, పశువైద్యాధికారి



వంగూరు, జూలై 8(ఆంధ్రజ్యోతి) : వర్షాకాలంలో పశులకు వచ్చే గొంతు వాపు వ్యాధి పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని, మండల పశువైద్య అధికారి డాక్టర్ సంతోష్ ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

పశువుల్లో గొంతువాపు వ్యాధి నివారణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

వర్షాకాలంలో పశువులు అటవీ ప్రాంతంలో మేత మేసిన తర్వాత గుంతల్లో నిల్వ ఉన్న కలుషిత నీరు తాగుతాయి. దాని వల్ల గొంతు వాపు వ్యాధి వచ్చే అవకాశాలు ఉంటాయి. నివారణకు అవులకు టీకాలు వేస్తాం.

వర్షాకాలంలో గొర్రెలు, మేకలకు వచ్చే వ్యాధుల నివారణకు చర్యలు ఏంటి?

వర్షాకాలం ప్రారంభంలో భూమిపై మొలిచే కొత్తగడ్డిని తినడం వల్ల మేకలు, గొర్రెలకు చిటికి రోగం వస్తుంది. నివారణకు పీపీఆర్ టీకా వేస్తే తగ్గుముఖం పడుతుంది.

పశుసంపద అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

మేలు రకం పశుసంతతి అభివృద్ధి కోసం కృత్రిమ గర్భధారణ ఎంతో ఉపయోగపడుతుంది. ఈ పద్ధతిలో రైతులు పశుసంపదను పెంచుకోవచ్చు.

పాల దిగుబడి పెంపకంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారా ?

మండలంలో సుమారు 8 వేల ఆవులు, 4 వేల గేదెలు ఉన్నాయి. రైతులకు పాల దిగుబడిపై అవగాహన కల్పించి ప్రోత్సహిస్తున్నాం.

న్యూస్ బాక్స్

బ్లాక్ గ్రానైట్ తవ్వకాలను నిలిపి వేయాలి

- కాలుష్య నియంత్రణ మండలికి రైతుల ఫిర్యాదు

చారకొండ, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సిరసనగండ్ల రెవెన్యూ శివారులోని 182 సర్వే నంబరులో చేపడుతున్న బ్లాక్ గ్రానైట్ తవ్వకాలను నిలిపివేయాలని పలువురు రైతులు కోరారు. మంగళవారం హైదరాబాద్‌లోని కాలుష్య నియంత్రణ మండలి, గనులు, భూగర్భ వనరుల శాఖ ఆటవీ శాఖ ఉన్నతాధికారులకు రైతులు కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ బ్లాస్టింగ్ తవ్వకాల వల్ల రవాణా నుంచి అధిక ధూళితో పంటలపై ప్రభావితం చూపుతుందని అన్నారు. అదేవిధంగా పశువులకు, ప్రజలకు దుమ్ముతో తీవ్రమైన శ్వాసకోశ సమస్యలు ఏర్పడే అవకాశాలున్నాయని అన్నారు. తక్షణమే బ్లాక్ గ్రానైట్ నిలిపి వేసి మైనింగ్ కార్యకలాపాలకు మంజూరు చేసిన అనుమతులను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతులు తిరుమలేష్, వెంకట్‌రాం, శ్రీను, విజయ్, సురేష్, చిన్నయ్య, దుర్గయ్య, హథిరాం, కొండల్ పాల్గొన్నారు.

రేపు గొర్రెలు, మేకల సంతకు బహిరంగ వేలం

ఉప్పునుంతల, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని వెల్టూరు గ్రామంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో 2025-26 సంవత్సరానికి ఈ నెల 10న గొర్రెల, మేకల బహిరంగ సంత నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శి ఉమాశంకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలం పాటలో పాల్గొనదలచిన వారు గ్రామపంచాయతీకి ఎలాంటి బకాయిలు ఉండరాదన్నారు. వేలం పాటలో పాల్గొనువారు గ్రామపంచాయతీలో తేదీ 8 నుంచి 10 తేదీ వరకు ఉదయం 10 గంటల వరకు దరఖాస్తు షెడ్యూల్ ప్రకారం సంతకు రూ. 500 చెల్లించి దరఖాస్తు ఫారం తీసుకొని, గుర్తింపు కార్డు జత చేయాలన్నారు. దరఖాస్తు ఫారానికి రూ.20వేల డీడీ జతచేసి పాటలో పాల్గొన్నారు.

'మండల కేంద్రంలో నాలుగు లేన్ల రహదారిని విస్తరించాలి'

చారకొండ, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం నుంచి మర్రిపల్లి వరకు ప్రస్తుత రోడ్డును నాలుగులైన్ల రోడ్డుగా విస్తరించి సెంటర్ లైట్లు ఏర్పాటు చేయాలని బీజేపీ యువ మోర్చా మండల నాయకుడు చింతపల్లి కిరణ్ గౌడ్ అన్నారు. మంగళవారం చారకొండలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ శిథిలావస్థకు చేరిన పురాతన బ్రిడ్జిని తొలగించి నూతన బ్రిడ్జిని ఏర్పాటు చేయాలని కోరారు. స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ ప్రత్యేక చొరవ తీసుకొని మండల కేంద్రంలో ఉన్న ప్రస్తుత రోడ్డును నాలుగు లేన్ల రహదారిగా విస్తరించి చారకొండ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

స్వేరోస్ మండల కమిటీ ఎన్నిక

అమ్రాబాద్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : స్వేరోస్ మండల కమిటీ అధ్యక్షుడిగా బరపటి కిశోర్‌ను ఎన్నుకున్నారు. మంగళవారం స్వేరోస్ జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి రెడ్డిపాకుల శివశంకర్ ఆధ్వర్యంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. స్వేరోస్ మండల కమిటీ ఉపాధ్యక్షుడిగా రమేష్, ప్రధాన కార్యదర్శిగా జగన్, ఆరనైజింగ్ కార్యదర్శిగా కిరణ్‌కుమార్, ముఖ్య సలహాదారుడిగా వెంకటేశులను ఎన్నుకున్నారు. భాస్కర్, మల్లేష్, విజయ్ పాల్గొన్నారు.

గ్రామ కమిటీ అధ్యక్షుడిగా సైదులు

తెలకపల్లి, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని జమ్మిస్తాపూర్‌లో స్వేరోస్ గ్రామ కమిటీ ఎన్నుకున్నారు. నాగర్‌కర్నూల్ అసెంబ్లీ నియోజకవర్గ స్వేరోస్ ప్రధాన కార్యదర్శిగా బొంగం వీరస్వామి, జిల్లా స్వేరోస్ ప్రధాన కార్యదర్శి రెడ్డపాకుల శివశంకర్ మాట్లాడారు. భవిష్యత్ తరాలను జ్ఞానం వైపు నడిపించే విధంగా స్వేరోస్ పని చేస్తుందని అన్నారు. స్వేరోస్ గ్రామ అధ్యక్షుడిగా సైదులు, కార్యదర్శిగా గోపాల్ ఎన్నికయ్యారు.

ఇళ్ల మధ్య ట్రాన్స్‌ఫార్మర్లతో... భయం.. భయం

- కంచెలేక పొంచి ఉన్న ప్రమాదం
- భయాందోళనలో ప్రజలు
- పట్టించుకోని అధికారులు



నక్కలపల్లి గ్రామంలో కంచె లేకుండా ప్రమాదభరితంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

పెద్దకొత్తపల్లి, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన పెద్దకొత్తపల్లితో పాటు వివిధ గ్రామాల్లో రహదారుల పక్కన, ఇళ్ల మధ్యలో కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదభరితంగా ఉన్నాయి. పెద్దకొత్తపల్లిలో సంత బజారులో రహదారి పక్కన నక్కలపల్లి, దేవునితిర్మలాపూర్, కల్వకోల్ తదితర గ్రామాల్లో రహదారుల పక్కన ఇళ్ల మధ్యలో కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాద భరితంగా మారాయి. ట్రాన్స్‌ఫార్మర్ల దగ్గర వర్షాకాలంలో అప్పుడప్పుడు మంటలు చెలరేగుతుండడంతో ఆయా గ్రామాల ప్రజలు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నారు. అంతేకాక కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్ల పక్కన దగ్గర నుంచి ఆవులు, గేదెలు వెళ్తుండడంతో ప్రమాదాలు జరిగే ప్రమాదాలు ఉన్నాయి. రైతులు పాడి రైతులు ఆందోళన చెందుతున్నారు. కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లకు కంచె ఏర్పాటు చేయాలని ఇళ్ల మధ్య ప్రమాద భరితంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు తొలగించి వేరే చోట ఏర్పాటు చేయాలని ఎన్నోమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్న పట్టించుకోవడం లేదని వారు ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు తక్షణమే చర్యలు తీసుకుని కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు ఏర్పాటు చేయాలి



గ్రామాల్లో కంచెలు లేకుండా ప్రమాదభరి తంగా పొంచి ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. వర్షాకాలంలో ట్రాన్స్‌ఫార్మర్ల సమీపం నుంచి వెళ్తే విద్యుత్ షాక్ తగిలి ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. అధికారులు తక్షణమే చర్యలు చేపట్టి కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు ఏర్పాటు చేయాలి.

- ఐద్దుల ప్రవీన్‌కుమార్ యాదవ్, సాతాపూర్

చిన్నపాటి గాలికి అంతరాయం

బల్మూరు : మండల పరిధిలోని గోదల్ గ్రామంలో మహరాజుల కాలనీ వద్ద 11కే వైర్ లైన్ స్తంభం ఒరిగి ఉండడం ద్వారా చిన్నపాటి వర్షానికి, గాలికి షార్ట్ సర్క్యూట్ అయి గోదల్ గ్రామంలో కరెంటు అంతరాయం జరుగుతుందని ఆ కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేశారు. ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచే లేకపోవడంతో పాటు విద్యుత్ వైర్లు కిందకి వాలి ఉండడం ద్వారా జీవాలు చనిపోతున్నాయి. ఈ ప్రాంతంలో ఉన్న రైతులు తమమోటార్లు బంద్ చేయడానికి వెళ్తుంటారని, ఆ సమయంలో విద్యుత్ వైర్లు కన్పించకుండా వైర్లకు తగినట్లయితే మృత్యువాతపడే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. 11కే వైర్‌లైన్ ఊరి దగ్గరలో కాకుండా గ్రామ చివరి నుంచి లైన్ తీసుకెళ్లడం ద్వారా ఎలాంటి ప్రమాదం జరగదని స్తంభం నాటి వైర్లు కింద పడకుండా చూస్తే గాని ఈ సమస్య పరిష్కారం కాదని వారు తెలిపారు. ప్రస్తుతం ముసురు వర్షాలతో కాలనీలో భయంగా ఉందని వెంటనే ఈ సమస్యను పరిష్కరించాలని అధికారులను వారు ఈ సందర్భంగా కోరారు.



గోదల్ గ్రామంలో ప్రమాదాలకు నిలయంగా మారిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

ఐకేపీ ఆధ్వర్యంలో సంబురాలు

- ఇందిరా మహిళా శక్తి సంబురాలు
- ప్రభుత్వం ఆర్థిక తోడ్పాటుపై హర్షం

చారకొండ, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఇందిర శక్తి సంబురాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. సంబురాలకు ఏపీఎం రాములు హాజరై మాట్లాడారు. మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంటోందని అన్నారు. అన్ని ప్రభుత్వ కార్యక్రమాల్లో మహిళలను భాగస్వామ్యం చేస్తున్నదని పేర్కొన్నారు. మహిళా సంఘాలకు ప్రభుత్వం వడ్డీ లేని రుణాలు ఇచ్చి ఆర్థికంగా తోడ్పాటును అందిస్తుందని అన్నారు. మహిళలకు ఇందిర మహిళ శక్తి క్యాంటిన్ ఏర్పాటు, ఎంటర్ ప్రైజెస్ సౌకర్యం, పెట్రోలు బంకు ఏర్పాటు, ఇందిర మహిళ శక్తి బజారు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఏర్పాటు, మినీ గోదాం ఏర్పాటు, ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు వంటి సామాజిక కార్యక్రమాలు చేపడుతోందని అన్నారు. వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చిన మహిళలను సన్మానించారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య మండల అధ్యక్షురాలు సత్యమ్మ, కార్యదర్శి నిర్మలమ్మ, కోశాధికారి అలివేలు, అన్ని గ్రామ సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారులు, సీసీలు మాధవి, విమల, లోకి, వీవోఏలు పాల్గొన్నారు.

● ఊర్కొండ : మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదికలో మహిళ శక్తి సంబురాలు నిర్వహించారు. ఎంపీడీవో కృష్ణయ్య మహిళా సాధికారతపై సంతోషం వ్యక్తం చేశారు. ఏపీఎం సంతోష్, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు శ్యామలమ్మ, కార్యదర్శి లక్ష్మీదేవి, కోశాధికారి లావణ్య సీసీలు సునీల్, ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

● ఉప్పునుంతల : ఇందిరా మహిళా శక్తి సంబురాలలో భాగంగా మంగళవారం మండల కేంద్రంలో మహిళా సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఎంపీవో తిరుపతయ్య మాట్లాడుతూ మహిళ సంఘాలకు మండల పరిషత్ అభివృద్ధి, గ్రామీణ బ్యాంక్ మేనేజర్ పలు అంశాలపై సూచనలు చేశారు. గ్రామ సంఘాల అధ్యక్షురాలు వీవోఏలు సీసీలు జైహింద్, సీబీవో ఆడిటర్ రామకృష్ణ, ఆపరేటర్ పాల్గొన్నారు.

● అమ్రాబాద్ : మండల సమాఖ్య కార్యాలయంలో ఇందిరా మహిళా శక్తి సంఘాల విజయోత్సవ సంబురాలను ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో ఏపీఎం నిరంజన్, సమాఖ్య అధ్యక్షురాలు సరస్వతి, సీసీలు వెంకటయ్య, శ్రీనివాసులు, మహిళా సమాఖ్య ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

● తిమ్మాజీపేట : మంగళవారం మండల కేంద్రంలోని మహిళా సమఖ్యలో ఇందిరా మహిళాశక్తి విజయోత్సవ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఏపీఎం బాలస్వామి మాట్లాడుతూ బ్యాంకుల ద్వారా రుణాలు పొంది కోళ్ల పెంపకం వంటి చిన్న చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకొని మహిళలు ఆర్థిక పురోగతిని సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీసీ నాగరాజు, యాదమ్మ, మంగమ్మ, వెంకటేశ్వరమ్మ, తిరుపతమ్మ, వీవోఏలు సుమలత, కళ్యాణ్, చంద్రిక, నిర్మల, వసంత పాల్గొన్నారు.



అమ్రాబాద్ : ఇందిరా మహిళా శక్తి సంఘాల సంబురాలలో భాగంగా అమ్రాబాద్‌లో సమాఖ్య ప్రతినిధులను సత్కరిస్తున్న ఏపీఎం నిరంజన్, సీసీలు

నేటి సమ్మెను జయప్రదం చేయాలి

చారకొండ, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : నేడు జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బండపల్లి బాలస్వామి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసి కనీస వేతనం అమలు చేయాలని కోరారు. ప్రభుత్వ రంగంలో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు. సార్వత్రిక సమ్మెకు మండలంలోని కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, ఆటో కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, ఆశ, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని సమ్మెను విజయవంతం చేయాలని ఆయన కోరారు. అంతక ముందు సార్వత్రిక సమ్మె కరపత్రాలను ఆయన విడుదల చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్షుడు మధు, కార్మికులు రాములు, లింగయ్య, కాశ్ల జంగయ్య, లింగమయ్య, దేవేందర్, మల్లయ్య, రామస్వామి పాల్గొన్నారు.

ప్రజా సంఘాల మద్దతు

మన్ననూర్ : దేశ వ్యాప్తంగా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహిస్తున్న సార్వత్రిక సమ్మెకు ప్రజాసంఘాలు మద్దతు ప్రకటిస్తున్నాయని పౌర హక్కుల సంఘం ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రధాన కార్యదర్శి జక్క బాలయ్య, తెలంగాణ ప్రజాఫ్రంట్ రాష్ట్ర కోకన్వీనర్ ఎడ్ల అంబన్న, కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర నాయకులు ముద్దునూరి లక్ష్మీనారాయణ తెలిపారు. అమ్రా బాద్ మండలం మన్ననూరులో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్లుగా విభజించి కార్మికుల న్యాయచట్టాలకు తూట్లు పడిచిందని విమర్శించారు.

కోడేరు : కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ నేడు జరగనున్న సార్వత్రిక సమ్మెను వ్యవసాయ కార్మిక సంఘాలు, బ్యాంకింగ్, పోస్టల్, ఇన్సూరెన్స్ వంటి రంగాల్లో పని చేసే వారితో పాటు రైతులు, తదితరులు పాల్గొని విజయవంతం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.నరసింహ కోరారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు.



చారకొండ : సార్వత్రిక సమ్మె కరపత్రాలను విడుదల చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బాలస్వామి

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

కొల్లాపూర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను కొల్లాపూర్ మండల పరిధిలోని సింగోటం గ్రామంలో మంగళవారం ఆ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సింగోటం ఎమ్మార్పీఎస్ గ్రామ అధ్యక్షుడు ఎల్లపోగు రమేష్ గ్రామంలోని అంబేద్కర్ భవనం వద్ద సంఘం జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ నాయకత్వంలో 30 సంవత్సరాల సుదీర్ఘ కాలంలో ఎస్సీ వర్గీకరణపై ఎన్నో పోరాటాలు, ఆత్మ బలిదానాలకు కూడా లెక్క చేయకుండా నేడు వర్గీకరణ సాధించామని గుర్తు చేశారు. అలాగే బడుగు, బలహీన వర్గాల వారికి అభివృద్ధి కోసం ఎమ్మార్పీఎస్ నాయకత్వంలో సిద్ధమవుదామని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అధికార ప్రతినిధి వై.చంద్రయ్య మాదిగ, గౌరవ సలహాదారులు వై.చిన్న రాముడు మాదిగ, కార్యవర్గ సభ్యులు కిరణ్, శేఖర్, రాముడు, యం.మద్దిలేటి, ఎల్లేష్, ఎమ్మార్పీఎస్ నాయకులు ఎన్మన్‌బెట్ల రామకృష్ణ పాల్గొన్నారు.

'ఖబ్రస్థాన్ భూమిని కాపాడాలి'

వెల్దండ, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఖబ్రస్థాన్ భూమిని కాపాడాలని పలువురు ముస్లిం మైనార్టీ నాయకులు కోరారు. మంగళవారం ముస్లిం మైనార్టీ నాయకులు తహసీల్దార్ కార్తీక్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. మండల కేంద్రంలోని 1, 2, 719 సర్వేనంబర్లతో పాటు గ్రామకంఠంలో ఉన్న 4.20 ఎకరాల ముస్లింలకు చెందిన ఖబ్రస్థాన్ భూమిని కొందరు అన్యాక్రాంతం చేస్తున్నారని ఆరోపించారు. ఖబ్రస్థాన్ భూమిలో ఉన్న బావిని పూడ్చివేసి సమీపంలో ఉన్న గోరీలను తొలగించారని, సదరు భూమిలో ప్లాట్లు చేసి అక్రమంగా విక్రయిస్తున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు.

కంటి సమస్యను నిర్లక్ష్యం చేయొద్దు

- ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీఈవో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి



కంటి ఆపరేషన్ చేసుకున్న వారితో ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీఈవో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

కల్వకుర్తి, జూలై8 (ఆంధ్రజ్యోతి) : కంటి సమస్యలు వస్తే నిర్లక్ష్యం చేయకుండా కళ్లను ప్రతీ ఒక్కరు కాపాడుకోవాలని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీఈవో సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి కోరారు. మంగళవారం ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో కల్వకుర్తి పట్టణంలోని సీకేఆర్ ఫంక్షన్‌హాలులో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్యశిబిరం నాలుగో రోజు ఆయన పరిశీలించారు. శిబిరంలో కంటి శుక్లాలు ఉన్న 28 మందికి కంటి ఆపరేషన్లు చేయించారు. ఆయన మాట్లాడుతూ ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ఉచిత కంటి పరీక్ష శిబిరం ఈ నెల 13 వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు నరేందర్‌గౌడ్, యూసఫ్‌బాబా, గణేష్, శ్రీపతిరాజు, యాదయ్య, రమేష్‌నాయక్, శేఖర్, రాఘవేందర్, శ్రీను, శివ, కళ్యాణ్ పాల్గొన్నారు.

సిర్సవాడలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

తాడూరు, జూలై8 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని సిర్సవాడ గ్రామంలోని 9వ వార్డులో కొంత కాలంగా వోల్టేజీ సమస్య ప్రజలను ఇబ్బంది పెడుతోందని లైన్‌మన్ శ్రీనివాసులు తెలిపారు. ఉన్నతాధికారుల సహకారంతో మంగళవారం వార్డులో నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసిలో వోల్టేజీ సమస్య పరిష్కరించామని పేర్కొన్నారు. అడిగిన వెంటనే ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి తాము ఎదుర్కొంటున్న సమస్యను తొలగించిన సందర్భంగా గ్రామస్థులు విద్యుత్‌శాఖ ఏఈ శ్రీరాములుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్థులు తాటికొల్ల రమేష్, చింతకింది రమేష్ పాల్గొన్నారు.



సిర్సవాడలో నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న లైన్‌మన్ శ్రీనివాసులు

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

- బీఎల్‌వోలకు సూచించిన కల్వకుర్తి ఆర్డీవో ఎస్ శ్రీను

కల్వకుర్తి, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌ఓ) జిల్లా ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కల్వకుర్తి ఆర్డీవో ఎస్. శ్రీను అన్నారు. మంగళవారం కల్వకుర్తి మునిసిపాలిటీ పరిధిలోని బీఎల్‌ఓలకు ఓరియంటేషన్ ట్రైనింగ్ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణలో మాస్టర్ ట్రైనర్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి కల్వకుర్తి ఆర్‌డీవో శ్రీను, తహసీల్దారు ఇబ్రహీం, మునిసిపల్ కమిషనర్ మహ్మద్‌షేక్ హాజరయ్యారు. కార్యక్రమంలో డీటీ రాఘవేందర్, సిబ్బంది పాల్గొన్నారు.



బీఎల్‌వోల శిక్షణలో మాట్లాడుతున్న ఆర్డీవో ఎస్ శ్రీను

పచ్చని చెట్లతో కళకళలాడాలి

- వసతిగృహాన్ని పరిశీలించిన ఎంపీడీవో ఆంజనేయులు

తాడూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని బాలికల వసతిగృహం పచ్చని మొక్కలతో కళకళలాడాలని ఎంపీడీవో అంజనేయులు అన్నారు. మంగళవారం కేజీబీవీలో మొక్కలు నాటే ప్రదేశాన్ని ఏపీవో చంద్రసిద్ధార్థతో కలిసి ఎంపీడీవో పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలతో పాటు కేజీబీవీల్లో సైతం మొక్కలు నాటి వాటిని సంరక్షించుకునే దిశగా అందరూ ముందుకు వెళ్లాలని సూచించారు. నాటిన ప్రతీ మొక్కను కాపాడుకొని పెంచి పెద్ద చేయాలని సూచించారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేక అధికారి విజయ పాల్గొన్నారు.



తాడూరు కేజీబీవీలో మొక్కలు నాటే ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో ఆంజనేయులు

జర్నలిస్టులను ఒక పార్టీకి అంటగట్టడం తగదు

- రిలే దీక్షలో జర్నలిస్టు నాయకులు

కొల్లాపూర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : సమాజ శ్రేయస్సు కోసం పని చేస్తున్న జర్నలిస్టులను ఒక పార్టీ కార్యకర్తలుగా గుర్తించడం మంత్రి జూపల్లి కృష్ణారావుకు తగదని టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాటికొండ కృష్ణ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ముందు జర్నలిస్టుల రిలే దీక్షల శిబిరం మంగళవారం కొనసాగాయి. మంత్రి జూపల్లి కృష్ణారావు కొల్లాపూర్ నియోజకవర్గంలోని గుర్తించిన 130 మంది జర్నలిస్టులలో 15 మందిని మినహాయించి 115 మంది జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేంత వరకు పోరాడుతామని కృష్ణ అన్నారు. కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు చక్కెర రామచందర్, జర్నలిస్టులు మల్లేష్, కురుమయ్య, సీపీ నాయుడు, గోవిందు, భాను ప్రకాష్, బాబు, గోపాసి కేశవులు, స్వాములు, సురేందర్, తరుణ్ ఉన్నారు.

సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి

- రాష్ట్ర సమితి సభ్యుడు వార్ల వెంకటయ్య

చారకొండ, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి పట్టణ కేంద్రంలో ఆగస్టు 1, 2 తేదీల్లో జరిగే సీపీఐ జిల్లా మూడవ మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు వార్ల వెంకటయ్య కోరారు. మంగళవారం మండల కేంద్రంలో మహాసభల వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం ఎన్నికల వాగ్దానాల్లో ఏ ఒక్కటీ నెరవేర్చడం లేదని పేర్కొన్నారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకు మతం, భక్తి పేరుతో దేశ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం బీజేపీ ప్రభుత్వం చేస్తోందని విమర్శించారు. జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేసి, ఇక్కడ లభ్యమవుతున్న ముడి సరుకులను ఉపయోగించడం ద్వారా ఈ ప్రాంత ప్రజలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ఈ మహాసభలకు సీపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడా వెంకట్‌రెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి బాలనర్సింహ హాజరవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యుడు డాక్టర్ చిలివేరు శ్రీనివాసులు, మండల కార్యదర్శి అశోక్‌గౌడ్, నాయకులు మద్ది నారాయణరెడ్డి, జెల్ల బాలయ్యగౌడ్, మొగిళ్ల శ్రీను పాల్గొన్నారు.

వ్యాయామ కేంద్రాన్ని తరలించాలి : సీపీఎం

నాగర్‌కర్నూల్ టౌన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని గాంధీ పార్కులో నిరుపయోగంగా ఉన్న వ్యాయామ కేంద్రాన్ని తక్షణమే జడ్పీ మైదానంలోకి తరలించాలని సీపీఎం మండల కార్యదర్శి రామయ్య డిమాండ్ చేశారు. మంగళవారం కేంద్రంలోని గాంధీపార్కులో వ్యాయామశాల వద్ద సీపీఎం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. రామయ్య మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని గాంధీపార్కులో లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన వ్యాయామ సామగ్రి తాళం వేసి ఉండడంతో పట్టణ ప్రజలు వినియోగించుకోలేకపోతున్నారని పేర్కొన్నారు. మునిసిపల్ అధికారుల ముందు చూపు లేకపోవడంతోనే గాంధీ పార్కులో ఏర్పాటు చేశారన్నారు. మునిసిపల్ అధికారులు తక్షణమే స్పందించి గాంధీపార్కులోని వ్యాయామ కేంద్రాన్ని క్రీడాకారులు, వాకర్స్‌తో ఎప్పుడూ రద్దీగా ఉండే జడ్పీ గ్రౌండ్‌లోకి తరలించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీపీ ఎం నాయకులు వెంకటేస్, శివరాములు, సుభాష్, మల్లికార్జున్, కురుమయ్య, హుస్సేన్, పరుశురాం, కృష్ణ మల్లేష్, శేఖర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత రైతు కుటుంబానికి రైతు బీమా చెక్కు అందజేత

పెద్దకొత్తపల్లి, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చంద్రబండతండా గ్రామ పంచాయతీలో అనారోగ్యంతో ముడావత్ గోబ్రియా మరణించారు. రైతు బీమా కింద మంజూరైన రూ.5 లక్షలు చెక్కును మృతుడి కుమారులు లోకేష్, రాముకు ఆ తండా మాజీ సర్పంచ్ రాంలాల్ అందజేశారు. ఇందుకు సహకరించిన తెలంగాణ రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు, స్థానిక నాయకులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

దివంగత సీఎం వైఎస్‌ఆర్‌కు ఘన నివాళి

- జిల్లాలో రాజశేఖర్‌రెడ్డి జయంతి నిర్వహించిన కాంగ్రెస్ శ్రేణులు, అభిమానులు

నాగర్‌కర్నూల్ టౌన్/ అచ్చంపేటటౌన్/ కొల్లాపూర్/ ఉప్పునుంతల/ తాడూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత వైఎస్. రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన వైఎస్‌ఆర్ చిత్ర పటానికి ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి పూల మాలలు వేసి నివాళులు అర్పించి కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. రాష్ట్రంలో వైఎస్‌ఆర్ అమలు చేసిన 108 ఆరోగ్యశ్రీ సేవలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, వ్యవసాయానికి ఉచిత కరెంటు, రుణమాఫీ వంటి పథకాలను గుర్తు చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు కొలన్ వల్లభ్‌రెడ్డి, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎండీ హబీబ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోటయ్య, మాజీ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అచ్చంపేట పట్టణంలోని రాజీవ్ విగ్రహం వద్ద పాలశీతలీకరణ కేంద్రం అధ్యక్షుడు నర్సయ్య యాదవ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు వైఎస్‌ఆర్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు.

కొల్లాపూర్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రంగినేని జగదీశ్వరుడు ఆధ్వర్యంలో వైఎస్‌ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఉప్పునుంతలలో వైఎస్‌ఆర్ విగ్రహానికి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కట్టా అనంతరెడ్డి, ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాలర్పించారు.

తాడూరులో దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు.



నాగర్‌కర్నూల్‌లో వైఎస్‌ఆర్ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి